క్లుప్తంగా

వచ్చే నెల 17 నాటికి సమగ్ర ఓటరు జాబితా డ్రాఫ్ట్



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో సత్యనారాయణ, చిత్రంలో తహసీల్దార్లు

కాకినాడ రూరల్: సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగంగా అక్టోబరు 17 నాటికి ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ ప్రచురిస్తామని నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా పరిశీలన నేపథ్యంలో ఫారం 6, 7, 8 త్వరితగతిన పరిశీలించాలన్నారు. ఇంటింటా పరిశీలించి వివరాలు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 2024 జనవరి నాటికి తుది ఓటర్ల జాబితా రూపొందిస్తామన్నారు. సమావేశంలో కాకినాడ రూరల్, కరప తహసీల్దారులు మురార్జీ, శ్రీనివాసరావు, డీటీ కళ్యాణ్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించాలి

కరప: వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, రైతులు ఆదాయం సమకూర్చుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కోట వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం సలహా మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వాలో ఎరువులు, పురుగుమందుల వినియోగంపై అవగాహన కల్పించి, పెట్టుబడులు తగ్గేలా చూడాలన్నారు. కరప సబ్‌డివిజన్ ఏడీఏ కె.బాబూరావు సార్వా పంటకు వాతావరణం అనుకూలంగా ఉందన్నారు, డ్రైనేజీ శాఖ ఏఈఈ కె.కీర్తిమాట్లాడుతూ మేజర్, మీడియం డ్రైన్లలో రూ.25.41 లక్షలతో గుర్రపు డెక్క తొలగింపు పనులు జరుగుతున్నాయని, కొంగోడువద్ద తుల్యభాగ డ్రెయిన్‌పై చేపట్టిన వంతెన నిర్మాణం పనులు ఏడాదిలో పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ చెప్పినట్టు వివరించారు. ఎంఏఓ ఏవీ రాజేష్, ఇరిగేషన్‌శాఖ ఐసీ కె.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థికి దాతల సాయం



పేద విద్యార్థికి ట్రైసైకిల్, నగదు, నిత్యావసరాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 8వ తరగతి చదువుతున్న దివ్యాంగ విద్యార్థి దున్నే లక్ష్మణ్‌కు పలువురు దాతలు సాయం అందించారు. కాకినాడలోని ప్రముఖ వైద్యుడు డాక్టర్ గోపీనాథ్ ట్రై సైకిల్, చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ రూ 3,500 విలువచేసే బియ్యం, కిరాణా సామగ్రి, హైస్కూలు ఉపాధ్యాయులు సమకూర్చిన రూ 3,500 జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అందజేశారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి, ఎంఈఓ-2 పి.సత్యనారాయణ, చేయూత స్వచ్ఛందసంస్థ ప్రధాన కార్యదర్శి ఎంఏ అలీమ్, హెచ్‌ఎం యు.లీలా మనోహర్, షేక్ మహబూబ్ ఆలీ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీఆర్ డిగ్రీ కళాశాల పాలక మండలి సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 22వ పాలకమండలి సమావేశం కళాశాల సమావేశపు హాల్లో శుక్రవారం నిర్వహించారు. పాలక మండలి చైర్మన్ హోదాలో కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ పోలా భాస్కర్ హాజరై 2020-22 విద్యా సంవత్సరాల విద్య, పరిపాలనకు సంబంధించి విషయాలపై సమీక్షించారు. ఆర్థిక విషయాలపై కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆర్‌జేడీ చప్పిడి కృష్ణ, పాలక మండలి సభ్యులు, వైస్ ప్రిన్సిపాల్ కె.ఆంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కరించండి



జడ్జి పి.కమలాదేవి

కాకినాడ లీగల్: జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించాలని కాకినాడ మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్‌పర్సన్ పి.కమలాదేవి అన్నారు. లోక్ అదాలత్‌లో కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, రాజీ పడదగిన క్రిమినల్, బీమా, బ్యాంకు సంబంధిత, ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించనున్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని న్యాయమూర్తి కోరారు.

మహిళలకు ఆర్థిక భరోసా

- వైఎస్సార్ సున్నా వడ్డీతో ఎంతో లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న డ్వాక్రా మహిళలు

బోట్‌క్లబ్: స్వయం సహాయక సంఘాల్లో అక్కచెల్లెమ్మల ఆర్థిక స్వావలంబనకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకంతో ప్రోత్సహిస్తోంది. ప్రజా సంకల్పయాత్రలో మహిళల ఆర్థిక ఇబ్బందులను చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలు తీసుకున్న రుణానికి వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని నవరత్నాల పథకంలో చేర్చారు. ఏటా క్రమం తప్పకుండా వడ్డీ మొత్తాలను నేరుగా లబ్ధిదారుల అప్పు ఖాతాల్లో జమ చేస్తున్నారు. నగరంలో ఈ ఏడాది 5616 మహిళా సంఘాలకు రూ.9.09కోట్లు అందించారు. పొదుపు సంఘ కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పడుతోంది. 2019లో వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని ప్రారంభించి క్రమం తప్పకుండా అందజేస్తూ వస్తోంది. తీసుకున్న రుణాల మొత్తాలను సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు సున్నా వడ్డీని వర్తింపజేస్తోంది. స్వయం సహాయక సంఘాల అప్పు ఖాతాల్లోకి నగదు జమ చేస్తున్నారు. బకాయి ఉన్న సంఘాలు పూర్తిగా చెల్లించిన తర్వాత మాత్రమే సున్నా వడ్డీకి అర్హత పొందుతాయి. ఏ నెలలో అయితే బకాయిలు పూర్తిగా చెల్లిస్తారో ఆ నెలకు మాత్రమే సున్నా వడ్డీని పొందుతున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కార్యక్రమాన్ని నాలుగేళ్లుగా సకాలంలో చెల్లించిన అన్ని సంఘాలకు, ఆ సంవత్సరంలో తీసుకున్న కొత్త రుణాలకు సైతం సున్నా వడ్డీ రుణాలను విడుదల చేస్తోంది. సంఘం అప్పు నిల్వలో గరిష్టంగా మూడు లక్షల వరకూ మాత్రమే సున్నా వడ్డీ వర్తిస్తుంది.



కాకినాడ ఐదో డివిజన్‌లో కిరణాషాపు నిర్వహిస్తున్న లబ్ధిదారు

చిరు వ్యాపారాలతో ఆర్థిక స్వావలంబన

మహిళా సంఘాలకు బ్యాంకులు ఇచ్చే రుణాలతో ఇంటి వద్ద చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుని వారి కుటుంబాలను పోషించుకొంటున్నారు. ఇంటి సమీపంలోనే కిరణా షాపు, టీ షాపు, బడ్డీకొట్టు పెట్టుకుని జీవిస్తున్నారు. బ్యాంకు ఇచ్చిన రుణానికి వడ్డీ భారం పడకుండా ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల ఆయా సంఘాల్లో సభ్యులకు ఎంతో లాభం చేకూరుతుంది.

జగనన్న మేలు మరువలేం



మహిళలను ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్న మేలు ఎప్పటికీ మరువలేం. గత ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు. జగనన్న చెప్పిన దానికన్నా ఎక్కువ చేస్తున్నారు. గత ప్రభుత్వంలోని డ్వాక్రా రుణాలను మాఫీ చేయడంతో పాటు మాకు మేలు జరుగుతోంది. మా గ్రూపునకు రూ.25 వేలు సున్నా వడ్డీ లభించింది.

– కె.అనురాధ, మెహబూబా మహిళా సంఘం

మహిళా పక్షపాత ప్రభుత్వం



వైఎస్సార్ సీపీ మహిళల పక్షపాత ప్రభుత్వం. అందుకే ప్రతి పథకాన్ని మహిళల పేరిట అమలు చేస్తున్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద మా గ్రూపునకు రూ.16 వేలు వచ్చింది. నాలుగేళ్లుగా వడ్డీ రాయితీ అందిస్తున్నారు. జగనన్న కుటుంబానికి మా ప్రభుత్వం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.

– కె.భాగ్యలక్ష్మి, వేంకటేశ్వర మహిళా సంఘం

నేటి నుంచి యోగా శిక్షణ

కాకినాడ కల్చరల్: శ్రీసత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ధ్యాన, ఆరోగ్య, యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు మండలి కన్వీనర్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం విద్యుత్‌నగర్‌లోని శాంతి ఆశ్రమం సమావేశ మందిరంలోను, ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో యోగ శిక్షణా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.

వేంకటేశ్వర ఆలయ హుండీల లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

బోట్‌క్లబ్: స్థానిక వెంకట్‌నగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో హుండీలను శుక్రవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. 103 రోజుల వ్యవధికి రూ.5.04 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ బిక్కిన వెంకటరాయచౌదరి తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ జ్యోతుల సీతారామమూర్తి, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవితకు ఆదరువు పింఛను కానుక

- ఎంపీ గీత, ఎమ్మెల్యే కురసాల
- రూరల్ మండల లబ్ధిదారులకు 1652 మందికి కొత్త పింఛన్ల పంపిణీ

కాకినాడ రూరల్: వైఎస్సార్ పింఛన్ కానుకతో పేద కుటుంబాల భవితకు భరోసా ఇస్తుందని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబు అధ్యక్షతన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ గీత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ నియోజవర్గంలో కొత్తగా 1652 మందికి పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఇప్పటి వరకు 33,152 పింఛన్లు ఇస్తుండగా కొత్తవాటితో 34,804 పింఛన్లను ప్రభుత్వం అందిస్తోందన్నారు. నియోజవర్గంలో లక్షా 6 వేల కుటుంబాలు ఉండగా వాటిలో ఉద్యోగులు, పన్నులు కట్టేవారు ఇతరత్రా మినహాస్తే మిగిలిన కుటుంబాల్లో అర్హులందరికీ పెన్షన్ అందుతోందని అన్నారు. కాకినాడ రూరల్ మండలంలో దాదాపు 18,400 పింఛన్లు, కరప మండలంలో 12వేల పింఛన్లు, అర్బన్ డివిజన్లలో 4,500 పింఛన్లు ఇస్తున్నామన్నారు. గతంలో జన్మభూమి కమిటీ వద్దకు వెళ్లి, వారికి చేయితడిపితే పింఛను వచ్చేదన్నారు. ఇప్పుడు సచివాలయ, వలంటీరు వ్యవస్థ ద్వారా ఆ పరిస్థితి లేదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఎంపీగా గీత, ఎమ్మెల్యేగా తాను మీ కోసం పనిచేస్తున్నామన్నారు. మరో ఆరు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని సంక్రాంతికి హరిదాసు వచ్చినట్టు కొన్ని పార్టీలు మీ వద్దకు వస్తాయన్నారు. వారిని నమ్మ వద్దన్నారు.



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు తదితరులు

ఎంపీ వంగా గీత మాట్లాడుతూ నూతన పింఛన్ వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అర్హులైన వారందరికీ కరెంట్ బిల్లులు ఎక్కువ వచ్చిన వారికి, ఇన్‌కం ట్యాక్స్, కార్లు ఉన్న వారికి పింఛన్లు తొలగిస్తే అందులో అర్హులకు పునరిద్ధరించారన్నారు. అర్హతే ప్రమాణికంగా సీఎం జగన్ పింఛన్లు, సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. మరో మూడు నెలల్లో రూ.3 వేలకు పింఛన్ సొమ్ములు పెరగనున్నాయన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, తిమ్మాపురం సర్పంచ్, జేఎన్‌టీయూకే ఈసీ మెంబరు బెజవాడ సత్యనారాయణ, పార్టీ నాయకులు గోపుశెట్టి బాబ్జీ, వైస్ ఎంపీపీలు గుత్తుల సత్తిబాబు, బందిలి విరీష, సర్పంచ్‌లు రామదేవు చిన్నా, గొలపల్లి రాంబాబు, పెంకే ఆనందరావు, పుల్ల కోటేశ్వరరావు, పుల్ల చందు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ సంస్థల్లో ఉద్యోగాలు మెండు



విద్యార్థులకు వీడియో ద్వారా అవగాహన కల్పిస్తున్న వరప్రసాద్

కరప: వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉద్యోగావకాశాలకు కొదవలేదని హెచ్‌ఎం ఎ.సాయి మోహన్ పేర్కొన్నారు. గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నతపాఠశాలలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించి, పలు విషయాలపై అవగాహన కల్పించారు. యానిమల్ హజ్బెండరీ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పీవీ వరప్రసాద్ వీడియో ద్వారా వ్యవసాయ, అనుబంధ శాఖల గురించి వివరించి, విద్య, ఉపాధి అవకాశాలను వివరించారు. కెరీర్ గైడెన్స్ ఉపాధ్యాయుడు ఐ.ప్రసాదరావు మాట్లాడుతూ వ్యవసాయ, పశుసంవర్ధకశాఖలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు అనేకం ఉన్నాయన్నారు. ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, టి.వేణుగోపాల్, వి.శోభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐడీఏ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీ దినోత్సవం



డాక్టర్ కీర్తిని సత్కరిస్తున్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్: ఇండియన్ డెంటల్ అసోసియేషన్ (ఐడీఏ) ఆధ్వర్యంలో స్థానిక బోట్‌క్లబ్ వద్ద ఉన్న కావేరి ఫిజియోథెరపీ ఆస్పత్రిలో శుక్రవారం ప్రపంచ ఫిజియో థెరపీ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రముఖ ఫిజియోథెరపీ వైద్యురాలు డాక్టర్ కీర్తి శరీర ఆరోగ్య సంరక్షణ, కీళ్ల నొప్పులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డాక్టర్ కీర్తిని అసోసియేషన్ అధ్యక్షుడు వెదురు పాక సతీష్, మాజీ అధ్యక్షులు అద్దాల సత్యనారాయణ సత్కరించారు.

15న టిడ్కో ఇళ్ల అప్పగింత

- పురపాలక మంత్రి రాక
- ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

కాకినాడ: టిడ్కో ఇళ్లను ఈ నెల 15న లబ్ధిదారులకు అప్పగించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఈ కార్యక్రమానికి రానున్నారు. తన ఛాంబర్‌లో టిడ్కో ఇళ్ల అప్పగింత, మంత్రి పర్యటన ఏర్పాట్లపై కమిషనర్ గురువారం ఆయన సమీక్షించారు. తొలి విడత 1152 ఇళ్లను అప్పగించనున్నామని, ఈ లోగా ఇళ్లలో అన్ని మౌలిక వసతులను పూర్తిచేయాలని కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో భాగంగా పారిశుద్ధ్యం, వేదిక ఏర్పాటు తదితర పనులపై ఆయన చర్చించారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, టిడ్కో ఈఈ రీటా, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ దేగల వెంకటరాజు, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

15 వరకూ మట్టి సేకరణ

కాకినాడ రూరల్: ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు నా భూమి-నా దేశం కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో మట్టి సేకరిస్తున్నామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రంబాల వెంకటేశ్వరరావు తెలిపారు. పార్టీ నేత కవికొండల చలపతిరావు ఆధ్వర్యంలో కవి కొండల భీమశంకర్ నివాసం వద్ద నుండి 48వ వార్డు పరిసర ప్రాంతాల్లో మట్టి సేకరించినట్టు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇంచార్జి కోడూరి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. జిల్లా అధ్యక్షులు చిలుకూరి రాంకుమార్, ఉపాధ్యక్షురాలు పితాని లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

కరప: స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉండే పూడుకుపోయిన డ్రైన్లను, డ్రైన్లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తదితరులు ఈ పనులను పర్యవేక్షించారు.

ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

కరప: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు వివరించి, సకాలంలో వైద్యసేవలందించాలని ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సూచించారు. మండలం వేళంగి పీహెచ్‌సీలో శుక్రవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్, 104 ద్వారా సంచారవైద్యం, ప్రభుత్వాసుపత్రులలో ప్రసవాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి కొత్తగా అమలుచేయనున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని మండలంలో అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీలో సీనియర్ అసిస్టెంట్, స్టాఫ్ నర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటిని భర్తీచేయించాలని డాక్టర్ ఎంకే సౌజన్య కోరగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామని ఎంపీపీ తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ అభివృద్ధికి, వైద్యసేవలపై చర్చించి, తీర్మానాలు చేశారు. ఎంపీడీఓ కె.అప్పారావు, జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

కరప: యువతి అదృశ్యంపై కేసు నమోదైంది. మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన యువతి ఇంటర్మీడియెట్ చదువుతూ, కరపలో కంప్యూటర్ కోర్స్ నేర్చుకుంటోంది. ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు కంప్యూటర్ క్లాసులకు వెళ్తున్నట్టు ఇంటివద్ద చెప్పి వెళ్లిన ఆమె ఇంటికి తిరిగి రాలేదు. పరిసర గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో గాలించినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ మేరకు హెచ్‌సీ కేయూ లింగారెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీలిమకు పీహెచ్‌డీ



బాలాజీచెరువు: నిపుణుల బృందం సిఫార్సు మేరకు ఎస్.నీలిమ ఇంప్లిమెంటేషన్ అండ్ క్వాలిటీ అసెస్మెంట్ ఆఫ్ నోవల్ కస్టరింగ్ బేస్డ్ ఆల్గోరిథమ్ ఫర్ ఎఫెక్టిక్ టోన్ మ్యాపింగ్ అంశంపై సిద్ధాంత వ్యాసం రచించారు. హైదరాబాద్ ఎలక్ట్రానిక్స్ రీసెర్చ్ ల్యాబ్ రిటైర్డ్ ఎస్‌జీ డాక్టర్ వై.రవికుమార్ పర్యవేక్షణలో సమర్పించగా ఈసీఈ విభాగంలో శుక్రవారం డాక్టరేట్ ప్రకటించారు.

వరాల తల్లీ.. కరుణించమ్మా!

- శ్రీపీఠంలో వ్రతాలు చేసిన 2 వేల మంది మహిళలు
- హాజరైన ఎంపీ గీత, ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో సుందరేశ్వర సమేత ఐశ్వర్యాంబిక అమ్మవారు కొలువైన శ్రీపీఠంలో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలు భారీగా జరిగాయి. శ్రీపీఠం స్వామిజీ పరిపూర్ణానంద దివ్య ఆశీస్సులతో రెండు వేల మంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీపీఠం వెనక గోశాల ప్రాంగణంలో ఈ వ్రతాలు నిర్వహించారు. పూజా సామగ్రిని నిర్వాహకులు అందించారు. ఈ సందర్భంగా పరిపూర్ణనంద స్వామి మాట్లాడుతూ శ్రావణ శుక్రవారం నాడు వరలక్ష్మీ వ్రతం ఎంతో ప్రధానమైనదని, అమ్మవారి అనుగ్రహంతో సౌభాగ్యం, సకల ఐశ్వర్యాలు కలుగుతాయని మహిళలకు ఆశీర్వచనాలు అంచారు. అనంతరం నవంబరులో నిర్వహించనున్న మహాశక్తి యాగం గురించి వివరించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి హాజరయ్యారు. ఎమ్మెల్యే కన్నబాబు మాట్లాడుతూ మహాశక్తి యాగానిక అండగా ఉంటామన్నారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ ఐశ్వర్యాంబిక కొలువైన ప్రాంగణంలో పూజల వల్ల కోటి రెట్లు ఫలితం ఉంటుందన్నారు. మహాశక్తి యాగం పరిపూర్ణం కావాలని, తాము సేవకులుగా పాలుపంచుకుంటామన్నారు. కార్యక్రమం ఏర్పాట్లను రాగిరెడ్డి కన్నా, ఆయన అనుచరులు, భక్తులు పర్యవేక్షించారు. అనంతరం అన్న ప్రసాదం అందించారు.



భీమేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు



శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానందతో మాట్లాడుతున్న ఎంపీ గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కౌడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి



శ్రీపీఠంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

నగరంలో కిక్కిరిసిన ఆలయాలు

బోట్‌క్లబ్: నగరంలో పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా నిర్వహించారు. స్థానిక దేవాలయంవీధిలో బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర ఆలయంలో సుమారు 1300 మంది మహిళలు వ్రతాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజనాల విజయసారధి మహిళలకు చీర, పండ్లు, పువ్వులు, పూజా సామగ్రి ఉచితంగా పంపిణీ చేశారు. సాయంత్రం వివిధ రకాల పండ్లు, వెయ్యి కేజీల స్వీట్లు, అరటి గెలలను 108 మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో 2000 వేల మంది మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారు. అలాగే భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో సుమారు 200 మంది మహిళలు కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ సత్తిబాబు పూజా సామగ్రితో పాటు వెండి వరలక్ష్మి రూపును మహిళలకు బహూకరించారు. ఈఓ ఎం మురళీవీరభద్రరావు ఏర్పాట్లు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్ నల్లబిల్లి సుజాత, ఎన్వీ సాయిబాబు పాల్గొన్నారు.



భానులింగేశ్వరస్వామి ఆలయంలో వెండిచీరలో దర్శనమిచ్చిన అమ్మవారు

అక్షరాస్యతతో సమాజాభివృద్ధి

కాకినాడ రూరల్: సంపూర్ణ అక్షరాస్యతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని జిల్లా బాలల సంక్షేమాధికారి సీహెచ్. వెంకటరావు పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.